శ్రమదానంతో కల్వర్టు పనులు

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో బోయతేలి పంచాయతీ రాసవీధి గ్రామ సమీపంలో తాత్కాలికంగా నిర్మించిన సిమెంటు పైపుల కల్వర్టు ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతింది. అప్పట్లో ఐటీడీఏ పీవో కల్వర్టును సందర్శించి త్వరలోనే శాశ్వత నిర్మాణానికి చర్యలు చేపడతామని తెలిపారు. వర్షాలు తగ్గి ముఖం పట్టి కొద్ది రోజులు గడుస్తున్నా ఎవరికి పట్టనట్టు అలాగే వదిలేశారు. గురువారం గ్రామస్తులు, వాహనదారులు చేయి చేయి కలిపి రాయిలను వేసి తాత్కాలికంగా ద్విచక్ర వాహనాలు, జీపులు వెళ్లడానికి వీలుగా శ్రమదానంలో పనులు చేశారు. ఇదిలా ఉండగా ఇటీవల ఆ కల్వర్టుపై జీపు వెళ్తుండగా కూరుకు పోయిన సంఘటన కూడా చోటుచేసుకుంది. ఎవరికి ఎటువంటి హాని జరగక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ కల్లర్టు మీదుగా సుమారు 30 గ్రామాల గిరిజనులకు నిత్యావసర సరుకులకు తెచ్చుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని పూర్తిస్థాయిలో శాశ్వత కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు.

రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత

-డోలి మోత కష్టాలను తొలగించాలి- గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కన్నబాబు

మాట్లాడుతున్న గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కన్నబాబు

ప్రజాశక్తి -పాడేరు : గిరిజన ప్రాంతంలో రహదారుల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె. కన్నబాబు స్పష్టం చేసారు. ఐటిడిఏ కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డోలీ మోతలు లేకుండా రవాణా సదుపాయాలు మెరుగు పరచాలని చెప్పారు. ఐటిడిఏ పరిధిలో అమలవుతున్న పథకాలపై అధికారులతో చర్చించారు. రహదారుల నిర్మాణాలు, కాఫీ ప్రాజెక్టు విస్తరణకు అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని అన్నారు. అత్యవసరమైన వంతెనలు, కల్వర్టుల నిర్మాణాలకు ప్రతిపాదించాలని చెప్పారు. తాజంగి స్వాతంత్ర సమర యోధుల మూజియంలో సివిల్ పనులను పూర్తి చేయాలన్నారు. వసతి గృహాలలో మరమ్మతులు, కనీస సౌకర్యాలు, అకడమిక్ కార్యాచరణ ప్రణాళికపై ఆరా తీసారు. వసతి గృహాలకు యూపి ఎస్ విద్యుత్తు సౌకర్యాలు సమకూర్చాలని పేర్కొన్నారు. అటవీ హక్కు చట్టంలో పరిష్కరించవలసిన క్లైములను అడిగి తెలుసు కున్నారు. వివిద పథకాలలో చేపట్టిన పనులు పురోగతి, బిల్లులు చెల్లింపులపై అడిగి తెలుసుకున్నారు.

ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ మాట్లాడుతూ కాఫీ ప్రాజెక్టు అమలు, పసుపు ప్రాజెక్టు, రహదారులు నిర్మాణాలు, చెక్ డ్యాంలు నిర్మాణాలు, అటవీ హక్కుల చట్టం అమలు, జీల జీవన్ మిషన్లో నిర్మించిన తాగునీటి పథకాలు, గిరిజన ప్రాంతంలో వైద్య ఆరోగ్య సేవలపై పవర్ పాయింట్ ద్వారా వివరించారు. మిషన్ కనెక్ట్ పాడేరులో చేపట్టిన పనులు, సికిల్ సెల్ ఎనిమియా పరీక్షలు, ప్రాజెక్టు లక్ష్య పేరిట సివిల్స్ కోచింగ్, సూపర్ 50 కింద పది విద్యార్థులకు అందిస్తున్న ప్రత్యేక శిక్షణా తరగతులు గత ఏడాది పదవ తరగతిలో విద్యార్థులు సాధించిన ఉత్తమ మార్కులపై తెలియజేసారు. జన్ మన్ పథకంలో 8వేల గృహాలకు విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు. నాబార్డ్, ఎస్సిఎ టు టిఎస్పి లో చేస్తున్న నిర్మాణపు పనులు, అంగన్వాడీ కేంద్రాల నిర్మాణాలు, కాఫీ ప్రాజెక్టులో చేపట్టిన విస్తరణ పనులపై వివరించారు. ఈ సమావేశంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వి.ఎస్. ప్రభాకరరావు, ఎం.వేంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఇఇలు డి.వి.ఆర్. ఎం.రాజు, కె. వేణుగోపాల్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమాల్ బాషా, డిసిహెచ్ ఎస్ కృష్ణారావు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు, ఐ.కొండలరావు, కాఫీ బోర్డు డిడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల సందర్శన

విద్య ఉన్నవాడే గొప్పవాడని సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కే.కన్నబాబు అన్నారు. గుత్తులు పుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అందిస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతులను గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కన్నబాబు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందిస్తున్న ప్రత్యేక బోధనను విద్యార్థులను తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పది విద్యార్థులు మన్యానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. భవిష్యత్తులో ఏమవుతారు అని విద్యార్థులను ప్రశ్నించారు. ఎక్కువమంది డాక్టర్ అవుతామని చెప్పడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్, గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఐ కొండలరావు, ఐటిడిఏ పీఓ లు వి ఎస్ ప్రభాకర్, ఎం వెంకటేశ్వరారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల తొలగింపునకు నిరసనగా..

5న సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా

సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్

మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్రంలో వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మికుల తొలగింపునకు నిరసనగా 5న పాడేరులో సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ తెలిపారు. గురువారం పాడేరులో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్బి పోతురాజు, సహాయ కార్యదర్శి ఎల్ సుందర్రావుతో కలిసి విలేకరుల సమావేశంలో చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, ఈ ధర్నాకు కార్మిక వర్గాలు కదిలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన మహాకూటమి ప్రభుత్వం వివిధ పథకాలలో పనిచేస్తున్న స్కీం వర్కర్లపై కక్ష కట్టి పథకం ప్రకారం తొలగింపులకు గురి చేస్తుందని మండిపడ్డారు. వాస్తవానికి స్కీం వర్కర్లు అంగన్వాడి, ఆశ, సిహెచ్ డబ్ల్యులు ,మధ్యాహ్నం భోజనం, వెలుగు సిబ్బంది, ఏ ప్రభుత్వానికి బానిసలు కాదని తెలిపారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా చెప్పిన పని తప్పకుండా భారమైనా చేస్తున్నారని, వీరిని గుర్తించి జీతభత్యాలు పెంచడమే కాకుండా కనీస వేతనాలు అమలు చేయవలసింది పోయి ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడటం అర్థరహితమని పేర్కొన్నారు. స్కీం వర్కర్ లందరూ కలిసికట్టుగా దీన్ని ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. 5 న జరిగే సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

తాగునీటి ట్యాంకుల క్లోరినేషన్

క్లోరినేషన్ చేస్తున్న సెక్రటరీ, సిపిఎం నేత

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండలంలోని జర్రెల గ్రామ పంచాయతీ సెక్రటరీ సింహాచలం గురువారం పంచాయతీకి చెందిన డేగల పుట్టు, ధోనిపుట్టులో తాగునీటి ట్యాంకుల్లో బ్లీజింగ్ చల్లించారు.సిపిఎం మండల కార్యదర్శి పాంగి భీమరాజు స్వయాన నీటి ట్యాంకిని శుభ్రపరచారు. ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. వ్యాధుల బారిన పడిన వారు తక్షణమే వైద్య కేంద్రాలలో వెళ్లి వైద్యం చేయించుకోవానే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ సావిత్రి, అంగన్వాడి కార్యకర్త బొయిదేవి, హెల్పర్ శ్రీదేవి పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సిఐ

చట్టాలు, హక్కులపై అవగాహన

ప్రజాశక్తి -హుకుంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళల చట్టాలు, హక్కుల పై గురువారం అవగాహన కల్పించారు. సీఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ, మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా బంగారు భవిష్యత్తును కాపాడు కోవాలన్నారు గంజాయి రవాణాలో విద్యార్థులు బలి కాకూడదన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించి అనవసరమైన లింకులను పంపే వాటిని క్లిక్ చేయకుండా జాగ్రత్త వహించాలన్నారు. డేటాను ఏ విధంగా హ్యాక్ చేస్తున్నారో అకౌంట్ లో నుంచి అమౌంట్ ని ఏ విధంగా తీస్తున్నారో అన్న విషయాలను క్లుప్తంగా వివరించారు. డ్రగ్స్ ని నివారించుటకు అరికట్టటకు పేరెంట్స్, ఉపాధ్యాయులు, పాఠశాల, కాలేజ్ కమిటీస్ ఇన్వాల్వ్ కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు,: ఈ నెల 27 వ తేదీ లోపు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా 2024-2025 విద్యా సంవత్సరంసకు సంభందించి పదవ తరగతి, ఇంటర్మీడియట్ తరగతులలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్ పొందడానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి పి. బ్రహ్మాజీరావు, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఆర్. శశి కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతిలో చేరుటకుగాను 14 సంవత్సరాలు నిండిన వారు, ఇంటర్మీడియట్ చేరుటకుగాను పదవ తరగతి పాసై 15 సంవత్సరాలు నిండిన వారు దరఖాస్తులు చేయుటకు అర్హులన్నారు. దరఖాస్తులను వెబ్సైట్లో చేసుకోవలన్నారు. దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని, ఆన్లైన్ లో సబ్మిట్ ఆగష్టు 28వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించవచ్చున్నారు. ఆగష్టు 28వ తేదీ లోపు అడ్మిషన్ ఫీజు చెల్లించవచ్చున్నారు. రూ.200ల ఫీజుతో సెప్టెంబర్ తొమ్మిదివ తేదీ వరకు గడువు ఉందని డిఇఓ వివరించారు. ఆసక్తి ఉన్న అభ్యాసకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవా ల్సిందిగా ఆయన కోరారు.

వంతెనకు నిధులు మంజూరుపై హర్షం

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని బెన్నవరం గ్రామాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ ఐఏఎస్ కుమార్ సందర్శించి వంతెన నిర్మాణానికి రూ. 2 కోట్ల నిధులు మంజూరు చేయడం హర్షనీయమని స్థానిక సర్పంచ్ బచ్చల సన్యాసమ్మ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వంతెన నిర్మాణం చేపట్టాలని పలుమార్లు అప్పటి ప్రజాప్రతినిధులను, అధికారులను కోరినా ఫలితం లేకపోయిందన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి రోజున తమ పంచాయతీలో వంతెన నిర్మించాలని కూటమి నాయకులతో జిల్లా కలెక్టర్కు తమ సమస్యను విన్నవించామన్నారు. దీంతో రహదారి కష్టాలు తీరుతున్నాయన్నారు.

పివిటిజి గ్రామాల్లో విద్యుత్ సరఫరా

-ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-అనంతగిరి: తుఫాను కారణంగా రెండు వారాలుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయి పివిటిజి గ్రామాలు అంధకారంలో మగ్గుతున్నాయని గురువారం ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి స్పందించిన విద్యుత్ అధికారులు మరమ్మతు పనులు చేపట్టి విద్యుత్ సరఫరా అందించారు. అనంతగిరి మండలం పంచాయితీ పరిధి డెకపురం, హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ పరిధి పక్కదొవడ పివిటీజీ గ్రామాలకు తుఫాను కారణంగా రెండు వారులుగా విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. రాత్రుల సమయంలో ప్రజలు ఇబ్బందులకు గురికావడమే కాకుండా అటవీ విషపూరితమైన జంతువులు గ్రామాల్లో సంచరించేవి. విద్యుత్ సరఫరాతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

పరీక్షలు చేస్తున్న వైద్యులు

కేన్సర్ వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని కిల్లోగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి సోవ్వ పంచాయతీ దేముడువలస ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో గురువారం ఉచిత కేన్సర్ ప్రాథమిక పరీక్షల శిబిరం నిర్వహించారు.వైఎస్ జయమ్మ మెమోరియల్ ట్రస్ట్, గ్రేస్ క్యాన్సర్ పౌండేషన్ (హైదరాబాద్), ఐటీడీఏ సంయుక్త ఆధ్వర్యాన జరిగిన ఉచిత క్యాన్సర్ పరీక్షలో 116మంది పాల్గొన్నారు. కో ఆర్డినేటర్ కనకేశ్వరరావు వైద్యాధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన గోదావరి

ఇంకా వరద నీటిలోనే ఉన్న గ్రామాలు

తమ ఇళ్లను చూసేందుకు పడవపై బయలుదేరిన విఆర్.పురం మండలం రామవరం వాసులు

ప్రజాశక్తి-విఆర్.పురం

గోదావరిలో వరద ఉధృతి తగ్గి నిలకడగా ప్రవహిస్తుంది. బుధవారం సాయంత్రం భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 44.90 అడుగులు ఉండగా, గురువారం సాయంత్రానికి 40.2 అడుగులకు తగ్గింది. చింతూరు, ఎటపాక మండలాలకు చెందిన వారు పునరావాస కేంద్రాల నుంచి ఇళ్లకు వెళ్లగా, విఆర్.పురం, కూనవరం మండలాల్లోని పలు గ్రామాల ప్రజలు ఇంకా పునరావాస కేంద్రాల్లోనే ఉన్నారు. వరద తగ్గినా మండల ప్రజల్లో భయం వీడటం లేదు. ఇప్పటికీ శ్రీరాంగిరి, కొల్లూరు, గొందూరు, కొండెపూడి, తుమ్మిలేరు గ్రామాలు వరద నీటిలోనే ఉన్నాయి. ఆయా గ్రామాల ప్రజలు గుట్టలపై గుడారాల్లో ఉంటున్నారు. కన్నాయిగూడెం, చొప్పల్లి, రామవరం, అడవి వెంకన్న గూడెం, ధర్మతాళగూడెం, ఒడ్డుగూడెం కాలనీ, ఒడ్డుగూడెం గ్రామాల్లో నీరు తగ్గినా రహదారులపై నీరు పోకపోవడంతో ఇంకా పునరావాస కేంద్రాలు, గుడారాల్లోనే నివసిస్తున్నారు. అడవిలోనూ, గుట్టలపై ఉంటున్న వారు పడవులపై విఆర్.పురం వచ్చి సరుకులు కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు.

విఆర్.పురం నుండి చింతూరు వెళ్లే ప్రధాన రహదారిపై వరద నీరు తొలగిపోలేదు. సోకులేరు వద్ద కిలో మీటర్ల మేరకు వరద నీరు ఉండిపోవడంతో ఈ రెండు మండలాల మధ్య 15 రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. విఆర్.పురం మండలంలో సుమారు 60 గ్రామాలకు రాకపోకలు లేకపోవడంతో వ్యవసాయ పనులు చేసుకునేందుకు కావాల్సిన డీజిల్, వ్యవసాయ పరికరాల కోసం రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శ్రీరామగిరి - సీతంపేట, తుష్టివారి గూడెం-ప్రత్తిపాక, కన్నాయి గూడెం- చింత రేవుపల్లి మధ్యలో రహదారులపై వరదనీరు ప్రవహించడంతో ఆయా గ్రామాల ప్రజలు పడవల పైన రాకపోకలు కొనసాగిస్తున్నారు. విఆర్.పురం - వడ్డిగూడెం మధ్యలో పడవ లేకపోవడంతో పీకల్లోతు నీళ్లలో పురుషులు మాత్రమే కాలినడకన తమ గ్రామాలకు వెళ్లి వస్తున్నారు. సున్నం వారి గూడెం నుండి కన్నాయి గూడెం మధ్యలో వరద తగ్గడంతో రహదారులపై చెత్త చెదారం పెద్ద మొత్తంలో పేరుకుపోయింది. దీని వల్ల వాహనాలు తిరిగే పరిస్థితి లేదని, తక్షణమే అధికారులు స్పందించి ఆ చెత్తను తొలగించాలని, మంపు గ్రామాల్లో బీసింగ్ జల్లించాలని ప్రజలు కోరుతున్నారు.

వరద ముంపు తగ్గకపోవడంతో పడవల్లో వెళ్లి నిత్యావసర సరుకులు తెచ్చుకుంటున్న అడవి వెంకన్న గూడెం వాసులు

ముంపు గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న

ఉద్యోగులకు ఆర్థిక సాయం అందించాలి

ప్రజాశక్తి-విఆర్.పురం

వరద ముంపు గ్రామాల్లో గత 15 రోజులుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని రేఖపల్లి సిపిఎం కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 15 రోజులుగా అధిక వర్షాల కారణంగా శబరి, గోదావరి ఉప్పొంగి విలీన మండలాల్లోని అనేక గ్రామాలు నీట మునిగాయని, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఉద్యోగులు వారికి అనేక రూపాల్లో సేవలు అందించారని చెప్పారు. ప్రధానంగా విద్యుత్ శాఖ, రెవెన్యూలో కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, సచివాలయం సిబ్బంది చేసిన సేవలు విలువ కట్టలేవని పేర్కొన్నారు. కుటుంబాలను వదిలి వరద బాధితులతో పాటు ఉండి వారికి అనుక్షణం అండగా నిలిచారని, అలాంటి ఉద్యోగులకు ఆర్థిక సాయం అందించవలసిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు.

వరద బాధితులకు ప్రభుత్వం సాయం పట్ల హర్షం

విఆర్ పురం : వరద బాధితులకు టిడిపి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సాయం పట్ల జెడ్పిటిసి వాళ్ల రంగారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మండలంలోని రేఖపల్లి ఎంపీడీవో కార్యాలయంలో జెడ్పిటిసి చాంబర్లో టిడిపి మండల కార్యదర్శి బుర్రక కన్నారావు అధ్యక్షతన ఆ పార్టీ మండల కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ వరద ముంపునకు గురైన గ్రామాల్లో ప్రతి కుటుంబానికీ రూ.3వేలు, టార్పలినట్లు, నిత్యావసర సరుకులు అందించిందని చెప్పారు. గోదావరి ప్రాంతాలలో బోట్లను అందుబాటులో ఉంచిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు, టిడిపి నాయకులు బొర్రా నరేష్ కుమార్, సవలం రాజేంద్రప్రసాద్, ముత్యాల సిద్దు, పాయం రామారావు, ముత్యాల రమేష్, సోడే వెంకమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ

నినాదాలు చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి-మారెడుమిల్లి

రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2009 నుంచి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి దాని ద్వారా అనేక పథకాలను అమలు చేయగా, వైసిపి ప్రభుత్వం ఆ బోర్డును నిర్వీర్యం చేసిందని తెలిపారు. ఇసుకపై ఆంక్షలు వల్ల భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారని, కరోనా కష్టకాలంలో లక్షలాది కుటుంబాలు వీధిన పడ్డాయని పేర్కొన్నారు. అయినా ప్రభుత్వం ఎటువంటి సహాయం అందించలేదని చెప్పారు. సంక్షేమ బోర్డులో ఉన్న డబ్బులు కరోనా కష్ట కాలంలో అర్హులైన కార్మికులకు రూ.10వేలు చొప్పున సహాయం అందించాలని కోరినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. పైగా సంక్షేమ బోర్డు నుండి డబ్బులు మొత్తం దారి మళ్లించిందని, ఎటువంటి క్లైములను మంజూరు చేయలేదని పేర్కొన్నారు. సంక్షేమ బోర్డు నుండి దారి మళ్లించిన రూ 3.50 కోట్ల నిధులను తిరిగి బోర్డులో జమ చేయాలని, అర్హులైన కార్మికులను సంక్షేమ బోర్డులో రిజిస్టర్ చేయాలని, సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, పెండింగ్లో ఉన్న క్లైమ్లను మంజూరు చేయాలని వాణిశ్రీ డిమాండ్ చేశారు. అనంతరం 15 మందితో నూతన కమిటీ ఎన్నిక ఎన్నిక కాగా, గౌరవ అధ్యక్షులుగా ఎం.వాణిశ్రీ, ఎన్నికయ్యారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు రామారాజు, ఇతర నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

అధ్వానంగా పెట్రాయి-రేఖపాడు రహదారి

- జారు బురదగా ఉండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- వాహనాలు దిగబడిపోతున్న వైనం

ప్రజాశక్తి-సీలేరు

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెట్రాయి- రేఖపాడు మధ్యలో రహదారి అధ్వానంగా తయారైంది. ఈ రహదారిలో ప్రజలు ప్రయాణం చేయాలంటే ప్రాణ సంకటంగా మారింది. జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ పెట్రాయి నుంచి రేఖపాడు జంక్షన్ వరకు సుమారు 6 కిలోమీటర్లు జిఎస్బి రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ట్రైబల్ వెల్ఫేర్ నిధుల నుండి రూ.60 లక్షలు మంజూరు చేసింది. వర్షాలకు ముందు కొంతమేరకు గ్రావెల్, దానిపై క్రషర్ బూడిద వేశారు. దానిపై మెటల్ రోడ్డు నిర్మాణం చేపట్టవలసి ఉండగా, ఇంతలో ఎడతెరిపి లేకుండా వర్షాలు పడడంతో రహదారి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. వర్షాలు కారణంగా ఈ రహదారి బురదగా మారగా, దానిపై వాహన రాకపోకలు సాగించడంతో జారు బురుదగా మారి రహదారి అస్తవ్యస్తంగా తయారైంది. బురదలో వాహనాలు కూరుకుపోయి ఎటూ వెళ్ళలేని స్థితి నెలకొంది. గురువారం ఈ రహదారిలో ఆటో బురదలో దిగబడిపోవడంతో తీవ్ర ఇబ్బంది పడ్డారు. ద్విచక్ర వాహనాలు సైతం ప్రయాణం చేయలేని పరిస్థితి ఏర్పడింది. రహదారి బురదమయంగా ఉడడంతో ఆయా గ్రామాల ప్రజలు, పాదచారలు, వాహన చొదకులు అష్టకష్టాలు పడుతున్నారు. నిత్యావసర సరుకులు కొనుగోలు, వైద్య సేవలు నిమిత్తం దారకొండ రాలేని పరిస్థితి నెలకొంది. వర్షాలకు అస్తవ్యస్తంగా మారిన పెట్రాయి రేఖపాడు రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేసి రాకపోకలు సాగించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బురదలో కూరుకుపోయిన ఆటోను బయటికి తీసిన ప్రయాణికులు

ఆదివాసీ దినోత్సవం రోజు సెలవు ఇవ్వాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆగష్టు 9వ తేదీన సెలవు దినంగా ప్రకటించాలని వనవాసి స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ గొర్లె అనుదీప్ కుమార్, మాజీ ఎంపీటీసీ గొర్లె అనిల్ ప్రసాద్ (బాబి) గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆదివాసీలు తమ ఉనికిని కోల్పోతున్నారని, గిరిజన సంస్కృతి, సంప్రదాయాల్ని, ఆచార వ్యవహారాలను ప్రదర్శించడానికి అనుగుణంగా సెలవు ప్రకటించాలని కోరారు.

'వరల్డ్ వైడ్ వెబ్ డే'పై అవగాహన

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:అరకులోయ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డిపార్ట్ మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో వరల్డ్ వైడ్ వెబ్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ రామకృష్ణ మాట్లాడుతూ, వరల్డ్ వైడ్ వెబ్ అనేది మొత్తం ప్రపంచాన్ని మన ముందు ఉంచే సాంకేతిక పరిజ్ఞానం అని, వెబ్ పేజీలు, ఆడియోఫైల్లు, వీడియోఫైల్లు వంటి లెక్కలేని ఆన్లైన్ వనరులను అనుసంధానించే నెట్వర్క్ తెలియజేశారు. అనంతరం వైస్ ప్రిన్సిపల్ పి చలపతిరావు మహిళ డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలు జి.సరస్వతి మాట్లాడుతూ,వరల్డ్ వైడ్ వెబ్ " అనేది పబ్లిక్ వెబ్ పేజీలను కలిపే వ్యవస్థ అని చెప్పారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు కె.ధర్మారావు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

చింతపల్లి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వరల్డ్ వైడ్ వెబ్ డే ను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కంప్యూటర్ అధ్యాపకురాలు లీలావతిని మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో వరల్డ్ వైడ్ వెబ్ అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆధునిక కాలం లో సాంకేతిక సమాచారాన్ని సులభంగా పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ రమణ, నాయక్, నాగేశ్వరరావు, జగదీష్‌బాబు, నాని, రవి, సతీష్, శివ, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

గోవులను రోడ్లపై వదిలేస్తే చర్యలు

- పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు చంద్రశేఖర్

ప్రజాశక్తి-చింతపల్లి:గోవులను వాటి యజమానులు ఇష్టారీతిన రహదారుల్లో వదిలిపెడితే చర్యలు తీసుకుంటామని, అటువంటి గోవులను గో శాలకు తరలిస్తామని చింతపల్లి పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు పి చంద్రశేఖర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల కేంద్రంలోని గోవుల యజమానులతో సమావేశం నిర్వహించి వాటి సంరక్షణపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు.

మాట్లాడుతున్న చంద్రశేఖర్

విశ్వాస్ సంస్థకు ప్రశంసలు

ప్రజాశక్తి- ఆరిలోవ : గురు పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణ చేసిన భక్తులకు సేవలందించిన స్వచ్ఛంద సంస్థలను సింహాచలం దేవస్థానం అధికారులు గుర్తించి, ఉత్తమ సేవలు అందించిన వారిని గుర్తించి గురువారం ప్రశంసాపత్రాలు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఇందులో భాగంగా ముడసర్లోవ వద్ద భక్తులకు మజ్జిగ, మందులు, తాగునీరు, ప్రసాదాలు అందించిన విశ్వాస్ సంస్థకు కూడా దేవస్థానం ఇఒ సింగల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ కార్యక్రమంలో ఉపకార్యనిర్వాహకులు, ప్రముఖుల సమక్షంలో సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా విశ్వాస్ సంస్థ ప్రతినిధి ఎంవి రావు మాట్లాడుతూ 30ఏళ్లుగా ఏటా గిరిప్రదక్షిణ భక్తులకు తమ సంస్థ ద్వారా సేవలు అందిస్తున్నామన్నారు. తమ సేవలను గుర్తించి సర్టిఫికెట్ అందజేసి ప్రోత్సహించిన దేవస్థానం పాలకమండలి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. గోపాలపట్నం ఎసిపి అన్నం నరసింహారావు, డిఎంహెచ్ఒ డాక్టర్ తిరుపతిరావు అగ్నిమాపక అధికారి ప్రసాదరావు, ఆర్‌డిస్ ఎండి రాజశేఖర్, దేవస్థానం ఎఇఒలు రమణమూర్తి, ఆనంద్ కుమార్, ఇఇలు శ్రీనివాసరాజు, రాంబాబు ఉన్నారు.

మన్యంలో జ్వర మరణాలపై కఠినచర్యలు

వైద్యాధికారులు, సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: అధికారులు, సిబ్బంది అలసత్వంతో మాతా శిశు మరణాలు, మలేరియా మరణాలు సంభవిస్తే తీవ్ర చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, మెడికల్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, యాంటీ మలేరియా, యాక్టివిటీసీ జరుగుతున్నా మరణాలు జరుగుతున్నాయని సీనియర్ అధికారులతో విచారణ చేయిస్తామన్నారు. వైద్యాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజల ప్రాణాలు కాపాడ వలసిన బాధ్యత వైద్యాధికారులు, వైద్య సిబ్బందిపైనే ఉందన్నారు. వైద్య సేవలు అందించడంలో వైఫల్యం చెందితే తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ నెలలో గేమ్మలి, హుకుంపేట, గౌరిదేవిపేటలలో జరిగిన మూడు మాతృ మరణాలపై కలెక్టర్ ఆరా తీసారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లల మరణాలపై ఆరా తీసిన కలెక్టర్ సకాలంలో సరైన వైద్యం అందక మరణాలు సంభవించినట్లు దృష్టికి వస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేసారు. కీటక జనిత వ్యాదులపై జిల్లా మలేరియా అధికారి కేసులు నోటిపై చేయడం లేదని, సకాలంలో వైద్యం అందిస్తే మరణాలు నివారించ వచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా అంతా ఏజన్సీ ప్రాంతమైనప్పటికీ పార్వతీపురం మన్యం జిల్లా కన్నా తక్కువ మలేరియా కేసులు నమోదు కావటం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేసిన కలెక్టర్ మలేరియా స్క్రీనింగ్ పరీక్షలన్నీ సంబంధిత పోర్టల్ లో అప్లోడ్ చేయాలని తద్వారా పోజిటివ్ కేసులను ట్రాక్ చేయడానికి వీలుంటుందని తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రతి శుక్రవారం డ్రై డేలో భాగంగా నిల్వ నీటిని తొలగించాలని, యాంటి మలేరియా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఇంటి బయటనే కాకుండా ఇంటి లోపల కూడా ఫాగింగ్ చేయాలని సూచించారు. సీజనల్ వ్యాదుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. దోమల మందు పిచికారీ పనులపై ముందుగానే గ్రామంలో దండోరా వేయించాలని స్పష్టం చేసారు. జ్వరం వచ్చిన రెండు రోజుల్లో రక్తపూతలు సేకరించి వైద్యం అందిస్తే మలేరియా జ్వరాలు నిర్మూలించ వచ్చన్నారు. మలేరియా హాట్ స్పాట్లను ముందుగానే గుర్తించి జాబితా సిద్ధం చేసి ప్రతీ రోజు వైద్యాధికారులు పర్యవేక్షించాలన్నారు. అవసరమైతే ఆసుపత్రుల అభివృద్ధి నిధులు వినియోగించి ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యు అధికారి బి. పద్మావతి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాష, జిల్లా మలేరియా అధికారి తులసి, జిల్లా కేంద్ర ఆసుపత్రి పర్యవేక్షకులు .విశ్వామిత్ర, డిసిహెచ్ఎస్ కృష్ణారావు పాల్గొన్నారు.

95 శాతం పింఛన్ల పంపిణీ

పాడేరు : జిల్లాలో సాయంత్రం 7 గంటల సమయానికి 95.04 శాతం ఫించన్ల పంపిణీ పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో 90 శాతం పైగా పంపిణీ జరిగిందన్నారు. మిగిలిన వారందరికీ శుక్రవారం నాటికి పింఛన్ల పంపిణీ పూర్తి చేసి శతశాతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ గుత్తుల పుట్టు సచివాలయం పరిధిలో గుత్తుల పుట్టు గ్రామంలో సందర్శించారు. విధ్యార్థికి సికెల్ సెల్ అనిమియా పింఛన్ రూ. 10,000 రూపాయలు కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న ఈ ఫించన్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి వి. మురళి, పాడేరు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు

శిక్షణకు ఎంపిక చేయండి

జిల్లాలో గిరిజన యువతకు ఆసక్తి ఉన్న రంగాల్లో ఎంపిక చేసి, అందులో శిక్షణ ఇవ్వాలని, తద్వారా వారికి ప్రత్యక్షంగా పరోక్షంగా లబ్ది చేకూర్చాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా నైపుణ్య కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న గిరిజన యువతకు ఇచ్చే శిక్షణలు వారికి ఉపయోగ పడే విధంగా ఉండాలన్నారు. స్థానిక అవసరాలు గుర్తించి ఆయా రంగాలలో శిక్షణ ఇవ్వడంతో వారికి లబ్ది చేకూరుతుందని వివరించారు. జిల్లాలో, జిల్లా పరిసర ప్రాంతాలలో ఉపాధి లభించే రంగాలలో శిక్షణ ఇస్తే ఉపయోగకరంగా ఉంటుం దని తెలిపారు. ఐటిడిఎల ప్రాజెక్ట్ అధికారులతో చర్చించి ఆయా ప్రాంతాలకు అనుగుణంగా శిక్షణా కార్యక్రమాలు ఎంపిక చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వ్యవసాయ యంత్రాల పరికరాల మరమ్మత్తులు, వ్యవసాయ, ఉద్యాన వేల్యూ యాడెడ్ అంశాలు, టూరిజం, హాస్పిటాలిటీ, నిర్మాణ రంగం, హెల్త్ కేర్, యాగ్రిగేటింగ్, లాజిస్టిక్స్, తేనేటీగల పెంపకం, వెదురు వస్తువులు తయారీ, పోలీసు రిక్రూట్మెంట్, సెక్యూరిటీ గార్డు, తదితర రంగాలలో శిక్షణ ఇవ్వడానికి కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ మురళి, జిల్లా నైపుణ్య శిక్షనాదికారి ప్రశాంత్, జిల్లా పరిశ్రమల మేనేజర్, ఉపాధి కల్పనాధికారి సంగీత, పాలిటెక్నిక్, ఐటిఐ కళాశాలల ప్రిన్సిపాల్సు పాల్గొన్నారు.

ఎయు అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి

లోక్‌సభలో ప్రస్తావించిన విశాఖ ఎంపీ శ్రీభరత్

ప్రజాశక్తి -మధురవాడ : విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం అభివృద్ధికి నిర్దేశించిన నిధులను తక్షణం విడుదల చేయాలని విశాఖ ఎంపీ శ్రీభరత్ లోక్‌సభ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మొదటి దశలో కేంద్రం నుంచి రావాల్సిన రూ.150 కోట్లు ఇంకా పెండింగ్‌లో ఉండగా, రెండవ విడతలో అదనంగా రూ.400 కోట్లు కావాలని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని, ఆ నిధులను త్వరితగతిన విడుదల చేయాలని కోరారు.

లోక్‌సభలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం కింద రాష్ట్రంలోని కేంద్ర విశ్వవిద్యాలయాలకు ప్రత్యేక నిధుల అవసరాన్ని ప్రస్తావించారు. ప్రాంతీయ, గిరిజన విద్యలో కీలకపాత్ర పోషించబోతున్న కేంద్ర విశ్వవిద్యాలయం, కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయాలు నిర్దేశిత లక్ష్యాలను నెరవేర్చడానికి కేంద్రం ప్రత్యేకదృష్టి పెట్టాలని కోరారు. ప్రస్తుతం కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం తగిన సౌకర్యాలు లేకుండానే నిర్వహిస్తున్నారన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం ప్రతిపాదించిన రెల్లి వద్ద ఏర్పాటుచేస్తే విశాఖ నగరానికి చేరువలో ఉండి విద్యార్థుల ఇంటర్న్‌షిప్, ఫ్యాకల్టీ నియామకానికి మెరుగైన అవకాశాలు ఉండేవన్నారు.

విద్యా బడ్జెట్ కేటాయింపులను పెంచిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర విద్యాలయాల బడ్జెట్ 11.22శాతం పెరగడం ద్వారా విద్యానాణ్యత, మౌలిక సదుపాయాలను మెరుగుపడతాయన్నారు. కేంద్ర విశ్వవిద్యాలయాల బడ్జెట్ 38.16శాతం పెరిగినప్పటికీ, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో గిరిజన విశ్వవిద్యాలయాల కేటాయింపులు కేంద్ర విశ్వవిద్యాలయాల పరిధిలోకి వస్తాయో, లేక విడిగా ఉంటాయో నిర్ధారించుకోవాల్సి ఉందన్నారు.

తల్లిపాలపై అవగాహన

ప్రజాశక్తి పెదబయలు: స్థానిక అంగన్వాడీ కేంద్రం 2 లో గురువారం తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి సీడీపీఓ వరహాలమ్మా పాల్గొని తల్లి పాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్స్ సింహాచలం, అంగన్వాడీ టీచర్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించి, వారికి తగు ప్రయోజనాలను కల్పించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరనున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు గంట్ల శ్రీనుబాబు తెలిపారు. గురువారం విశాఖ పౌరగ్రంథాలయంలో ఎపి బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అర్బన్ యూనిట్ సమావేశంలో మాట్లాడుతూ, జర్నలిస్టులకు ఇళ్ల మంజూరు సమస్య ఎప్పటికీ పరిష్కారం కావడం లేదన్నారు. 2014-19 మధ్య జర్నలిస్టులకు టిడ్కో ఇళ్లు కేటాయించేందుకు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించిదన్నారు. తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం అర్హులైన జర్నలిస్టులకు మూడుసెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలను కేటాయించేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సేకరించిందన్నారు. దరఖాస్తులు, ప్రతిపాదనలతోనే కాలం తీరిపోతోందని, జర్నలిస్టుల ఇళ్ల కేటాయింపులు సాకారం కావడం లేదన్నారు. దీనిపై త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లను కలిసి విన్నవించనున్నట్లు తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులకు ఇళ్లస్థలాల కేటాయింపునకు ఒకే పాలసీని అమలు చేసే యోచనలో ప్రభుత్వం ఉందని ప్రభుత్వ పెద్దలు చెబుతున్న నేపథ్యంలో దాన్ని వీలైనంత త్వరలో కార్యరూపంలో పెట్టాలనికోరనున్నట్లు తెలిపారు. అలాగే అన్ని కమిటీల్లోనూ జర్నలిస్ట్ సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరనున్నట్లు తెలిపారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ అర్బన్ యూనిట్, అధ్యక్ష, కార్యదర్శులు పి.నారాయణ్, జి.శ్రీనివాసరావు, బాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ విశాఖ యూనిట్ అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, కార్యదర్శి మదన్ ప్రతినిధులు పి.నర్సింగరావు, నాయుడు, కె.బాబూరావు, మళ్ల దేవత్రినాథ్, నాయుడు, ఏ.సురేష్, ఏ.శేషు, జిఆర్ ఎస్ రమేష్, ఎన్.నెలరాజు, శివ దిలీఫ్ పాల్గొన్నారు

హెచ్‌ఎంలతో సమావేశమైన ఎంఇఒ మల్లేశ్వరరావు

ప్రధానోపాధ్యాయులతో ఎంఇఒ సమావేశం

ప్రజాశక్తి-రంపచోడవరం : స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులతో ఎంఇఒ మల్లేశ్వరరావు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు 10.30 లోపు పూర్తి చేయాలని, మధ్యాహ్న భోజన పథకంలో మెనూ ఫొటోలను, టాయిలెట్ ఫొటోలు తీసి క్యాప్చర్ చేయాలని, ప్రతినెలా కోడిగుడ్లు, చిక్కిలను వివరాలను యాప్‌లో అప్లోడ్ చేసి రిసిప్ట్ డౌన్లోడ్ చేయాలని సూచించారు. కావలసిన నోటు పుస్తకాల తరగతులు క్రమ సంఖ్య ఆధారంగా జాబితాను తయారు చేయాలని, ఆధార్ పెండింగ్ ఉన్న విద్యార్థులు జాబితాను, పాఠశాలలో అదనంగా ఉన్న స్టూడెంట్ కిడ్స్ ఎంఆర్సికు అప్పగించారని, ఐఎఫ్పి ప్యానల్స్, బై జ్యూస్ ట్యాబ్ పనిచేస్తున్నది లేనిదీ రిపోర్టులు తయారు చేయాలని ఆదేశించారు.

భవన నిర్మాణ కార్మికునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అడ్డతీగల : మండల కేంద్రం అడ్డతీగల సీతారామరాజుకాలనీకి చెందిన భవన నిర్మాణ కార్మికుడు మడకం రాజు నిర్మాణ పనులు చేస్తుండగా పడిపోవడంతో కాలు విరిగి ఏ పనీ చేయలేని పరిస్థితుల్లో ఉండగా, తోటి కార్మికులు రాజుకు ఆర్థిక సాయం అందించారు. శ్రీ వినాయక తాపీ పని వారి సంక్షేమ సంఘం నాయకులు గురువారం రాజు ఇంటికి వెళ్లి వారి కుటుంబానికి ధైర్యం చెప్పి యూనియన్ తరపున రూ.2000 అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి గుల్లల సురేష్ బాబు, లింగం పెద్దకాపు, చాగంటి ఆదినారాయణ, కన్నబాబు, సూరిబాబు, రాజు, వీరబాబు, గంగాధర్ పాల్గొన్నారు.

12 వారాల ఉపాధి హామీ వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : ఉపాధి హామీ పథకం కింద పనులు చేసిన కూలీలకు 12 వారాల నుండి కూలి డబ్బులు చెల్లించకపోవడంపై గురువారం రాజవొమ్మంగి మండలం, జడ్డంగి పంచాయితీలో ఉపాధి హామీ కూలీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకులు తెడ్ల రాంబాబు మాట్లాడుతూ చేసిన పనులకు సమయానికి వేతనాలు రాక ఏజెన్సీలో ఉపాధి కూలీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొన్నటి వరకు ఎడతెరిపి లేకుండా వర్షాలు పడడంతో కూలీ పనులు కూడా లేక కూలీలు కుటుంబాలను పోషించుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే వేతన బకాయిలు చెల్లించకుంటే మండల కేంద్రంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు గూడెం లక్ష్మి, బచ్చాల బేబి, మోడిద వెంకటేశ్వర్లు, తాటికొండ సత్యనారాయణ, గూడెం బంగారాజు, మొసర సత్తిబాబు, బచ్చల తాతబాబు, గాంధీ, దుర్గాదేవి, సత్యవతి, తెడ్ల ముసలమ్మ, సత్తిబాబు, పండ సత్యవేణి, తీగలా దుర్గ ప్రసాద్, కృష్ణ, గూడెం సత్తిబాబు, పుసాం లోవకుమార్, లోతా మల్లిబాబు, తొంటా వెంకటరమణ పాల్గొన్నారు.

కెకె లైన్‌లో దంతెవాడ వరకే రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కెకె లైన్‌లోని కిరండూల్ ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పలు రైళ్లను షార్ట్ టర్మినేట్ చేస్తున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. ఈ క్రమంలో 08551 విశాఖపట్నం-కిరండూల్ ప్యాసింజర్, 18514 విశాఖపట్నం-కిరండూల్ ఎక్స్‌ప్రెస్‌లను ఆగస్టు 1 నుండి 7 వరకు దంతెవాడలో షార్ట్ టర్మినేట్ చేయనున్నారు, అదేవిధంగా 08552 కిరండూల్-విశాఖపట్నం ప్యాసింజర్, 18513 కిరండూల్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 2 నుండి 8 వరకు కిరండూల్‌కు బదులుగా దంతెవాడ నుంచి ప్రారంభమవుతాయి. కావున ఈ తేదీల్లో కిరండూల్-దంతెవాడ మధ్య ఈ రైలు సేవలు ఉండవని, ప్రజలు మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ సీనియర్ డిసిఎం సందీప్ తెలిపారు.

పాల రైతు సదుపాయాల కోత

విశాఖ డెయిరీ కొత్త నిబంధనలు
గతంలో బోనస్ నిలిపివేత
తాజాగా మరణ పరిహారం తగ్గింపు
అన్యాయమైపోతామన్న రైతులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, మునగపాక విలేకరి

విశాఖ డెయిరీ పాల రైతుల సదుపాయాలకు కోత పెడుతోంది. వారి సంక్షేమాన్ని క్రమంగా గాలికొదిలేస్తోంది. డెయిరీకి పాలు పోస్తున్న రైతును ప్రోత్సహించకపోగా గతంలో ఉన్న సదుపాయాలను తగ్గిస్తోంది. పాల రైతుకు వర్తించే ఇన్సూరెన్స్‌ను ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి రైతు పోసిన పాల ఆధారంగా పరిహారం వర్తించేలా నిబంధనలు మార్చింది. ఈ ఏడాది ఫిబ్రవరి 26న జరిగిన విశాఖ డెయిరీ బోర్డు సమావేశం పాలు పోస్తున్న పాడి రైతుకు అమలుచేస్తున్న మరణ పరిహార నిబంధనలను మార్చుతూ తీర్మానం చేసింది. గతంలో పాల రైతుకు బోనస్ నిలిపివేసిన డెయిరీ యాజమాన్యం.. తాజాగా పరిహారం చెల్లింపులో విధించిన షరతులతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి రహస్యంగా అమలు చేయాలనుకున్న నూతన నిబంధనలు బయటకు రావడంతో పాల రైతులు కలవరం చెందుతున్నారు.

డెయిరీ నిబంధనలు ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని మూడు లక్షల మంది పాల రైతులకు సమస్యగా మారాయి. ఎవరికి పరిహారం వర్తిస్తుందో, ఎవరికి వర్తించదో తెలీని పరిస్థితి నెలకొంది. పాలు పోసిన రైతు చనిపోతే వారసులకు మరణ పరిహార సొమ్ము కచ్చితంగా వస్తుందన్న ఆశ ఇప్పుడు లేకుండాపోయింది. పాల ఉత్పత్తిదారుల వారసులకు మరణ పరిహారం చెల్లించడానికి గత మూడేళ్లలో ఏ ఒక్క సంవత్సరమూ పాల కేంద్రానికి పోసే పాలు 200 లీటర్లకు తగ్గకూడదన్న నిబంధనను తప్పనిసరిచేసింది. మరణించిన పాడిరైతుకు సుఖీభవ కార్డు, వయస్సు 60, ఆపైన వుండాలని, వారసులు విధిగా పాలను సరఫరా చేయాలని నిబంధనలు విధించింది. కొత్త నిబంధనల ప్రకారం అర్హత కలిగిన పాడి రైతు వారసులకు చెల్లించే మరణ పరిహారం తగ్గించి చెల్లించనుంది.

విశాఖ డెయిరీ (ఫైల్‌ఫొటో)

మూడేళ్లలో ఏడాదికి సగటున 200 లీటర్లకు పైబడి పాలు పోసిన రైతుకు డెయిరీ నుంచి మూడు వేలు, 500 లీటర్లు పైబడి పాలు పోసిన రైతుకు రూ.7,500, 750 లీటర్లు పైబడి పాలు పోసిన రైతుకు రూ.పది వేలు, వెయ్యి లీటర్లు పైబడిన రైతుకు రూ.15 వేలు చొప్పున డెయిరీ పరిహారం ఇవ్వనుంది. నూతన నిబంధనలు ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లోకి వస్తాయని ఈ ఏడాది మార్చి 30న సర్క్యులర్ విడుదల చేసింది. పాలతో నిమిత్తంలేకుండా 60 ఏళ్ల దాటిన పాల రైతు చనిపోతే వారసులకు రూ.30 వేలు, 60 ఏళ్లలోపు రైతు చనిపోతే లక్షల రూపాయలు చెల్లించేవారని మునగపాకకు చెందిన గణేష్ తెలిపాడు. రైతు పాల సరఫరాతో ఇన్సూరెన్స్ పరిహారాన్ని ముడిపెట్టడం వల్ల రైతు కుటుంబాలకు అన్యాయం జరుగుతోందని పాల రైతులు అంటున్నారు. రైతు ఇన్సూరెన్స్ చేసుకున్నా, ఏ ఏడాది పాల సరఫరా తగ్గినా మరణించిన రైతు వారసులకు పరిహారం వర్తించదని వాపోతున్నారు. గతంలో బోనస్ చెల్లింపును డెయిరీ ఆపేయడంతో ఏడాదికి రూ.12 వేలు నష్టపోయానని తిమ్మరాజుపేట పాల రైతు శరగడం శ్రీనివాసరావు తెలిపాడు. ఇదే విషయమై విశాఖ డెయిరీ ఎమ్‌డి ఎస్‌వి.రమణ మాట్లాడుతూ సొసైటీలో పాలు పోసి మరణించిన రైతు కుటుంబాలకు సొసైటీ డబ్బులకు, డెయిరీ కొంత సొమ్ము కలిపి మానవతా దృక్పథంతో సాయం చేసేదని అన్నారు. డెయిరీ సాయం తగ్గించలేదని, సొసైటీ నుంచి డబ్బులు ఇవ్వడంలేదని అన్నారు.

వయనాడ్ బాధితుల కోసం

సిపిఎం విరాళాల సేకరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేరళలోని వయనాడ్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు కొండ చరియలు విరిగి వందలాది మంది ప్రాణాలు కోల్పోయారని, అనేక కుటుంబాలవారు నిరాశ్రయులయ్యారని, వారిని మానవతా దృక్పథంతో ఆదుకోవాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో గురువారం జగదాంబ సెంటర్‌లో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేనంతగా ప్రకృతి విలయ తాండవం చేసిందని, భారీ కొండ చరియలు, పెద్ద పెద్ద బండరాళ్లు దొర్లుకుంటూ వచ్చి కుటుంబాల కుటుంబాలను నిద్రలోనే మృత్యువాతకు గురిచేశాయని తెలిపారు. ఈ ఘటన దేశ ప్రజల హృదయాలను కలిచివేసిందన్నారు. కేరళ ప్రభుత్వం, ప్రజలు స్వచ్ఛందంగా యుద్ధ ప్రాతిపదికన పునరావాస, సహాయ చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ప్రజలు కష్టాల్లో వుంటే వారికి సహాయం చేయాల్సిన కేంద్ర బిజెపి ప్రభుత్వం దీన్ని రాజకీయం చేయడం హేయమైన చర్యని అన్నారు. ఆపదలో వున్న వయనాడ్ ప్రజానీకానికి సహాయంగా యావత్ ప్రజానీకం నిలబడాలని కోరారు. విరాళాల సేకరణలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుబ్బారావు, యుఎస్ఎన్.రాజు, నాయకులు వై.రాజు, జి.అప్పలరాజు, వి.తులసీరాం, కెవిపి.చంద్రమౌళి, కె.నరసింగరావు, అప్పారావు, కె.కుమారి, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం జోన్ ఆధ్వర్యాన...

సిపిఎం కంచరపాలెం జోన్ ఆధ్వర్యాన ప్రజల నుంచి విరాళాలు సేకరించారు. ప్రజలు ఉదారంగా స్పందించారు. పార్టీ జోన్ కార్యదర్శి బొట్టా ఈశ్వరమ్మ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు బి.పద్మ, జోన్ నాయకులు ఒ.అప్పారావు, పి.రామారావు, పిట్టా మూర్తి, సూర్యనారాయణ, ఒ.విజయ, కొండ, కుమారి పాల్గొన్నారు.

బియ్యం, కూరగాయలు పంపిణీ చేస్తున్న ఉప సర్పంచ్ వీరబాబు

బాధిత కుటుంబానికి బియ్యం, కూరగాయలు పంపిణీ

ప్రజాశక్తి-మారేడుమిల్లి : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలో చావడికోట పంచాయతీ బొడ్లంక గ్రామం, బొడ్డుమాను వీధిలో గిరిజన కుటుంబం కొండ్ల రాజయ్య, గంగమ్మ ఇల్లు ధ్వంసం కాగా, ఆ కుటుంబానికి గురువారం బియ్యం, కూరగాయలు పంపిణీ చేశారు. చావడికోట సర్పంచ్ సాధల ప్రేమ కుమార్ రెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లాల రాజ్‌కుమార్ రెడ్డి దాతల సాయం కోరగా మారేడుమిల్లి పంచాయతీ ఉపసర్పంచ్ బొడ్డేటి వీరబాబు తన వంతు సహాయంగా 50 కేజీల బియ్యం, వంట సామాగ్రి, కూరగాయలు అందించారు. సర్వం కోల్పోయిన రాజయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పల్లాల లక్ష్మి భూపతి రెడ్డి, దూడ సుందర్ పాల్, చావడికోట పంచాయతీ ప్రేమ్ కుమార్, విఆర్ఓ పాల్గొన్నారు.

ఎడిఇగా అప్పలనాయుడు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -సీలేరు : సీలేరు కాంప్లెక్స్ పంపు స్టోరేజ్ ప్రాజెక్టు ఏడీఇగా అప్పలనాయుడు గురువారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు దిగు సీలేరు డొంకరాయి జల విద్యుత్ కేంద్రం పరిధిలో ఏడిఈ సివిల్‌గా అప్పలనాయుడు ఏడు నెలలపాటు విధులు నిర్వహించారు. తాజాగా జెన్కో అధికారులు సీలేరు పంపు స్టోరేజ్ ప్రాజెక్టుకు బదిలీ చేస్తూ ఉత్తరాలు జారీ చేయడంతో ఈ మేరకు ఆయన లాంఛనంగా బాధ్యతలు చేపట్టారు.

భద్రాచలం వెళ్లి పింఛను అందజేత

ప్రజాశక్తి-మోతుగూడెం : చింతూరు మండలం, మోతుగూడం పంచాయతీ పరిధి ఫార్బయ్ గ్రామానికి చెందిన సామాజిక పింఛనుదారు కొసలా లక్ష్మి అనారోగ్యంతో 15 రోజులుగా 100 కిలోమీటర్లు దూరంలో ఉన్న భద్రాచలం ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేష్ గురువారం భద్రాచలం ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేశారు. దీనిపై పలువురు గ్రామ పెద్దలు, ప్రజలు వెంకటేష్‌కు అభినందనలు తెలిపారు.

వెలుగు సిసిపై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి-సీలేరు : డ్వాక్రా సంఘాలకు శ్రీనిధి రుణాలు మంజూరు విషయంలో అలసత్వం వ్యవహరిస్తున్న వెలుగు సిసి వరలక్ష్మిపై అధికారులు చర్యలు చేపట్టాలని సిఐటియు నాయకులు జి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండల కేంద్రం జికె.వీధి పంచాయతీ పరిధిలో డ్వాక్రా సంఘాలకు లోన్లు మంజూరు చేయాలని పైఅధికారులు ఆదేశించినా వెలుగు సీసీ వరలక్ష్మి మంజూరు చేసేందుకు ఎటువంటి చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. తమకు లోన్లు ఇప్పించండి మహాప్రభువు అంటూ డ్వాక్రా సంఘాల సభ్యులు వెలుగు కార్యాలయానికి వెళ్తే నానా దుర్భాషాలాడుతుందని పేర్కొన్నారు. డ్వాక్రా సంఘాల సభ్యులను పదేపదే ఆఫీసులు చుట్టూ తిప్పుతూ కాలయాపన చేస్తుందని తెలిపారు. ఇటువంటి సీసీ తమకు అవసరం లేదని, వేరే మండలానికి ఆమెను తక్షణమే బదిలీ చేయాలని పై అధికారులకు విజ్ఞప్తి చేశారు. జీకే వీధి మండల పరిధి క్లస్టర్లో వివోల రెండు నెలల జీతం బిల్లులు పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వెలుగు సిసి వరలక్ష్మిని బదిలీ చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా రంగసాయి థియేటర్ అవార్డుల వేడుక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రంగసాయి నాటక రంగం 14వ వార్షికోత్సవం సందర్భంగా రంగసాయి థియేటర్ అవార్డుల - 2024 కార్యక్రమం గురువారం సాయంత్రం మద్దిలపాలెంలోని కళాభారతిలో ఘనంగా జరిగింది. నటుడు, రచయిత, దర్శకుడు తనికెళ్ల భరణికి జీవన సాఫల్య పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా తనికెళ్ల భరణి మాట్లాడుతూ సినీ రంగానికి తల్లి వంటి నాటక రంగం నుండి అవార్డు పొందడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు.